నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్
5 | నిజామాబాద్, మంగళవారం 23 జనవరి 2024 | ADILABAD

# సమస్యల పరిష్కారానికే ఫిర్యాదుల విభాగం

**- నిర్మల్ ఎస్పీ జానకీ షర్మిల**

నిర్మల్ అర్బన్, జనవరి 22 : ప్రజా సమస్యల పరిష్కారానికే ఫిర్యాదుల విభాగాన్ని నిర్వహిస్తున్నామని ఎస్పీ జానకీ షర్మిల అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల విభాగంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పోలీసులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని సూచించారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ జానకీ షర్మిల



ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని వినాయక్ చౌక్ వద్ద శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

# జై శ్రీరాం

- అయోధ్యలో బాల రాముడి ప్రాణ ప్రతిష్ఠతో మారుమోగిన రామనామం
- రామాలయం, హనుమాన్ ఆలయాల్లో ఎమ్మెల్యేలు, ప్రముఖుల పూజలు
- విగ్రహ ప్రతిష్ఠాపన మహాఘట్టాన్ని టీవీలు, స్క్రీన్‌లపై వీక్షించిన ప్రజలు
- ఆకట్టుకున్న రాముడు, లక్ష్మణుడు, సీత, శబరి మాత వేషధారణలు



సారంగాపూర్ : జామ్‌లో అయోధ్య నుంచి రాముడి ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

నమస్తే నెట్‌వర్క్ : అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రాణ పటిష్ఠతో సోమవారం పల్లె, పట్టణాల్లో పండుగ వాతావరణం నెలకున్నది. రామాలయం, హనుమాన్ ఆలయాల్లో ఎమ్మెల్యేలు, అధికారులు, ప్రజాప్రతినిధులు యజ్ఞాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో శ్రీ సీతారాముల చిత్రపటాలు, పట్టువస్త్రాలు, అక్షింతలతో బ్యాండ్ మేళాలు, మంగళహారతులు, గుస్సాడీ నృత్యాలు, కోలాటాల మధ్య శోభాయాత్ర నిర్వహించారు. భక్తి పాటలపై ఉత్సాహంగా నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా చిన్నారులు వేసిన రాముడు, లక్ష్మణుడు, సీత, శబరి వేషధారణలు ఆకట్టుకున్నాయి. ప్రజలు ప్రాణ పటిష్ఠ కార్యక్రమాన్ని టీవీలు, ఎల్‌ఈడీ స్క్రీన్‌లపై వీక్షించారు. వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలు మూసి వేశారు. ప్రతి ఇంటి ముంగిట మహిళలు ముగ్గులు వేసి దీపాలను వెలిగించారు. ఇంటిపై శ్రీరాముని జెండాను ఎగుర వేశారు. పాఠశాలల్లో జై శ్రీరాం ఆకారంలో విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు. సామూహిక రామ భజనలు, హనుమాన్ చాలీసా పారాయణం, తారక మంత్రం చేశారు. కొన్నిచోట్ల బైక్ ర్యాలీలు నిర్వహించారు. శ్రీరామ.. జయరామ.. జయజయ రామ.. హరేరామ హరేరామ నినాదంతో ఆలయాలు మారుమోగాయి. చిన్న పిల్లలు మొదలుకొని పండు ముదుసలి వరకు యువతీయువకులు, మహిళలు రామదండుగా కదిలారు.

- ఆదిలాబాద్ పట్టణంలోని ద్వారకనగర్‌లో గల ఐశ్వర్య సిద్ధి హనుమాన్ ఆలయంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్ పూజలు చేశారు. అనంతరం గోపాల కృష్ణమఠంలో ఎస్పీ గౌస్ ఆలంతో కలిసి ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు. ● సారంగాపూర్, దిలావర్‌పూర్ మండలాల్లో నిర్వహించిన భవ్య రాముడి ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాల్లో నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. ● భైంసా పట్టణంలోని పలు కాలనీల్లో స్థానిక ఎమ్మెల్యే రామారావు పటేల్ పర్యటించారు. భట్టిగల్లిలో నిర్వహించిన శోభాయాత్రలో పాల్గొని గోశాలలో పూజలు చేశారు. ● జైనథ్ మండలంలోని దీపాయిగూడలో గల రామాలయంలో మాజీ మంత్రి జోగు రామన్న ప్రత్యేక పూజలు చేశారు. ● ఉట్నూర్ పట్టణంలోని రామాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుతోపాటు మాజీ ఎంపీ రమేశ్ పాల్గొన్నారు.
- ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాగూడ(జీ)లో గంగాజలానికి వెళ్తున్న మెస్రం వంశీయులు రాముడి చిత్రపటానికి పాలాభిషేకంతోపాటు జలాభిషేకం చేశారు. అనంతరం రాముడి చిత్రపటంపై అక్షింతలు వేశారు. ● భైంసా పట్టణంలోని ఆయా ఆలయాల్లో జరుగుతున్న ఉత్సవాలను సీసీ కెమెరాల ద్వారా ఎస్పీ జానకీ షర్మిల పర్యవేక్షించారు. అనంతరం పట్టణంలోని పలు సమస్యాత్మక ప్రాంతాలను పరిశీలించారు. ● కుభీర్‌కు చెందిన జాదవ్ మాధవ్ సుమారు 1,300 కిలో మీటర్లు నడిచి ఆదివారం అయోధ్యకు చేరుకున్నాడు. ● బాల రాముడి విగ్రహ ప్రతిష్ఠాపన సమయంలో నిర్మల్ పట్టణంలోని శాంతినగర్ హౌజింగ్ బోర్డు కాలనీలోని రామాలయంలో వానరం ఆలయం ధ్వజస్తంభం పైకి ఎక్కి కొద్ది సేపు ఊపింది. దీంతో భక్తులు తన్మయం పొందారు.
- నిర్మల్ జిల్లా కేంద్రంలోని బంగల్‌పేట్ కాలనీలో గల హనుమాన్ మందిరంలో జరిగిన శ్రీరాముడి పూజ కార్యక్రమానికి సయ్యద్ హైదర్ హాజరయ్యాడు. రాముడి చిత్రపటానికి పూలమాల వేసి పూజలు చేశారు. అన్నదానానికి విరాళం అందించాడు. ● కుంటాల మండలంలోని కల్లూరులో గల హనుమాన్ ఆలయంలో చాక్‌పెల్లికి చెందిన హుస్సేన్ సాబ్ భక్తి గీతాలను ఆలపించి మత సామరస్యాన్ని చాటుకున్నాడు.



కుంటాల : హనుమాన్ ఆలయంలో భక్తి గీతాలను ఆలపిస్తున్న హుస్సేన్ సాబ్



నిర్మల్ అర్బన్ : శాంతినగర్ హౌజింగ్ బోర్డు కాలనీలోని రామాలయంలో ధ్వజస్తంభాన్ని ఊపుతున్న వానరం



నిర్మల్ అర్బన్ : జై శ్రీరాం అక్షర క్రమంలో విద్యార్థులు



నటరాజ్ థియేటర్ వద్ద హనుమాన్ ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న



జైనథ్ : భోరజ్ శ్రీరామాలయంలో పూజలు చేస్తున్న ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్



భైంసా : గోవులకు పూజ చేస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్



ఉట్నూర్ : ఎమ్మెల్యేను సన్మానిస్తున్న హిందూ సంఘాల నాయకులు



ఇంద్రవెల్లి : నాగోబా ఆలయంలో అక్షింతలతో ఆదివాసులు



అర్జీలను స్వీకరిస్తున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్

# దరఖాస్తుల స్వీకరణ

ఎదులాపురం, జనవరి 22 : ఆదిలాబాద్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్‌రాజ్ దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. శాఖలవారీగా సమీక్షలు నిర్వహించి అర్జీదారులకు రాత పూర్వకంగా సమాధానం ఇవ్వాలన్నారు.

**నిధులను వినియోగించుకోవాలి.. : కలెక్టర్ రాహుల్‌రాజ్**

యేటా ప్రభుత్వ శాఖలు 16 శాతం ఎస్సీల సంక్షేమానికి నిధులను వినియోగించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో షెడ్యూల్డ్ కులాల ప్రత్యేక అభివృద్ధి నిధుల అమలుపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నేడు(మంగళవారం) జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క జిల్లా పర్యటన నేపథ్యంలో అధికారులు ఆయా శాఖల సంక్షిప్త నివేదికలతో ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్‌లో నిర్వహించే సమావేశానికి హాజరు కావాలని ఆదేశించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో స్రవంతి, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి భగత్ సునీతాకుమారి, డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, డీఎస్‌వో కిరణ్‌కుమార్, మార్కెట్ ఏడీ శ్రీనివాస్, డీపీవో శ్రీనివాస్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శంకర్, డీబీసీడీవో రాజలింగు, వ్యవసాయ శాఖ అధికారి పుల్లయ్య పాల్గొన్నారు.



పాదయాత్రగా వెళ్తున్న మెస్రం వంశీయులు

# గుంజాలకు చేరుకున్న పాదయాత్ర

**- కేస్లాగూడ(జీ)లో ఝురికి సంప్రదాయ పూజలు**

ఇంద్రవెల్లి, జనవరి 22 : గంగాజల సేకరణ కోసం ఆదివారం సాయంత్రం కేస్లాపూర్ నుంచి బయలుదేరిన మెస్రం వంశీయుల పాదయాత్ర.. సోమవారం సాయంత్రం నార్నూర్ మండలంలోని గుంజాల గ్రామానికి చేరుకున్నది. ఉదయం కేస్లాగూడ(జీ) గ్రామస్తులతోపాటు పురుషులు, మహిళలు గంగాజలం సేకరించే ఝురికి సంప్రదాయ పూజలు చేశారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. గుంజాల గ్రామానికి చేరుకోగా గిరిజనులు పొలిమేరలో స్వాగతం పలికారు. అక్కడే బస చేసి మంగళవారం ఉదయం బయలు దేరనున్నారు.



ఝురికి పూజలు చేస్తున్న కేస్లాగూడ(జీ) గిరిజన మహిళలు

# ఐటీడీఏ ఇన్‌చార్జి పీవోగా ఖుష్బు గుప్తా

ఉట్నూర్, జనవరి 22 : ఉట్నూర్ ఐటీడీఏ ఇన్‌చార్జి పీవోగా ఖుష్బు గుప్తా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న చాహత్ బాజ్‌పాయ్ ఆరు నెలలపాటు సెలవుపై వెళ్లారు. దీంతో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఖుష్బు గుప్తా ఇన్‌చార్జి పీవోగా నియామకం అయ్యారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పరిధిలోని పలు శాఖల అధికారులను పరిచయం చేసుకున్నారు.



బాధ్యతలను స్వీకరిస్తున్న ఖుష్బు గుప్తా

# గిరిజనులకు పథకాలు అందించాలి..

- అన్ని శాఖల అధికారులతో ఇన్‌చార్జి పీవో సమీక్ష
- పనుల పురోగతి, విద్యాశాఖపై సమావేశం

ఉట్నూర్, జనవరి 22 : అర్హులైన గిరిజనులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో ఖుష్బు గుప్తా అన్నారు. స్థానిక కుమ్రం భీం ప్రాంగణంలో అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పనుల పురోగతిపై అడిగి తెలుసుకున్నారు. విద్యాశాఖపై సమీక్షించారు. గిరిజన సంక్షేమ శాఖలో సీఆర్టీలు, నాలుగో తరగతి ఉద్యోగులకు అందిన వేతనాలు, అందాల్సిన వేతనాలపై చర్చించారు. అలాగే ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కతో ఉమ్మడి జిల్లా సమావేశం ఉండనున్న నేపథ్యంలో ఏర్పాట్లపై తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో భీంరావు, పీటీజీ ఏపీవో ఆత్రం భాస్కర్, ఏవో రాంబాబు, పీహెచ్‌వో సందీప్, అధికారులు ఉన్నారు.



ఇచ్చోడ మండలంలోని ముక్రా(కే)లో నిర్మించిన చెక్‌డ్యాం

# నీటి వృథాకు చెక్

- కేసీఆర్ సర్కారు హయాంలో రూ.126.48 కోట్లతో 47..
- 8,819 ఎకరాలకు సాగు నీరు.. పెరిగిన భూగర్భ జలమట్టం..
- యేటా రెండు పంటలు.. ఆనందంలో అన్నదాతలు

## ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా చెక్‌డ్యాంల నిర్మాణం

ఆదిలాబాద్, జనవరి 22 (నమస్తే తెలంగాణ) : కేసీఆర్ సర్కారు ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా సాగునీటి వనరుల కల్పనకు పెద్దపీట వేసింది. ప్రాజెక్టుల నిర్మాణాలు చేపట్టింది. మిషన్ భగీరథ పథకంలో భాగంగా చెరువులను పునరుద్ధరించింది. వర్షపు నీరు వృథా కాకుండా చెక్‌డ్యాంలను నిర్మించింది. సాత్నాల ప్రాజెక్టు ఆధునికీకరణ పనులు చేపట్టడంతో చివరి ఆయకట్టుకు నీరు అందుతున్నది. మిషన్ కాకతీయ పథకంలో భాగంగా 208 చెరువులకు మరమ్మతులు చేపట్టగా 45 వేల ఎకరాల ఆయకట్టు పెరిగింది.

### 47 చెక్‌డ్యాంల నిర్మాణం

ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా యేటా 1,400 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవుతున్నది. ఎత్తయిన ప్రాంతాలు, గుట్టలు, వాగులు, వంకల ద్వారా వర్షపు నీరు వృథాగా పోతున్నది. నీటిని వృథా పోనివ్వకుండా చెక్‌డ్యాంలను అప్పటి కేసీఆర్ సర్కారు భావించింది. ఇందుకోసం 47 చెక్‌డ్యాంలను నిర్మించింది. ఒక్కో చెక్‌డ్యాంకు రూ.2 కోట్ల నుంచి రూ.2.50 కోట్ల చొప్పున రూ.126.48 కోట్లను కేటాయించింది. ఈ చెక్‌డ్యాంలను ఆదిలాబాద్, ఇచ్చోడ, ఉట్నూర్ సబ్ డివిజన్‌లలో చేపట్టారు. ఆదిలాబాద్ సబ్‌డివిజన్‌లో 15 చెక్‌డ్యాంలు, ఇచ్చోడ సబ్‌డివిజన్‌లో 17ఉట్నూర్ సబ్‌డివిజన్‌లో 15చెక్‌డ్యాంలను నిర్మించారు. వీటి ఫలితంగా 8,819 ఎకరాలకు సాగనీరు అందడంతోపాటు భూగర్భజలాలు గణనీయంగా పెరిగాయి. కేసీఆర్ సర్కారు అందించిన సాయంతో తాము రెండో పంటను సాగు సాగు చేసుకునే అవకాశం లభించిందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. చెక్‌డ్యాంలో వల్ల భూగర్భ నీటిమట్టం పెరిగి ఎండాకాలంలో తాగునీటి సమస్య ఉండడం లేదు.

# అర్జీలను పరిష్కరించాలి..

**నిర్మల్ కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్**

నిర్మల్ టౌన్, జనవరి 22 : ప్రజావాణిలో ప్రతి సోమవారం స్వీకరించే అర్జీలను సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అధికారులతో కలిసి బాధితుల నుంచి 15 అర్జీలను స్వీకరించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ పాల్గొన్నారు.

**ఆడపిల్లల రక్షణకు చర్యలు తీసుకోవాలి..**

ఆడపిల్లల రక్షణకు అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నేషనల్ గర్ల్ చైల్డ్-2024ను పురస్కరించుకుని ఈనెల 19 నుంచి 24వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించే ప్రచారానికి ఆయన శ్రీకారం చుట్టారు. కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రచార ఫ్లెక్సీపై కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్లు సంతకాలు చేశారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు కిశోర్‌కుమార్, ఫైజాన్ అహ్మద్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి రమేశ్, డీపీవో శ్రీలత పాల్గొన్నారు.

**ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి..**

ఫిబ్రవరి 1వ తేదీ నుంచి నిర్వహించే ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలతోపాటు 28 నుంచి నిర్వహించే వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పేర్కొన్నారు. కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షలు ఫిబ్రవరి 1 నుంచి 15 వరకు ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయన్నారు. వార్షిక పరీక్షలు 28 నుంచి మార్చి 18వ తేదీ వరకు ఉంటాయని తెలిపారు. 38 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని, విద్యార్థులు పరీక్షలు రాసేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.



ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్, అధికారులు